సాక్షి జగిత్యాల

బుధవారం । 14 । జూన్ । 2023

రక్తం ఇవ్వు.. ఎప్పుడూ ఇస్తుండు..

రక్తదాన శిబిరాలలో రక్తదానం చేయండి!
దోమలను మీ రక్తాన్ని పీల్చుకోనివ్వకండి.
మీ రక్తంతో రోగులు శ్వాస పీల్చుకోనివ్వండి!
ఎంత దానం చేసినా.. తరగని ఆస్తి రక్తం.
ఆపదలో ఉన్న వారికి అదే అమృతం!
రక్తదానం నిలబెట్టును ప్రాణం.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం. ఇచ్చేది కొంతైనా నిండు జీవితాన్ని నిలబెట్టే సంజీవని. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే రక్తదాతలు దొరక్కపోతే.. పరిస్థితి ఊహించుకోండి. రక్తం ఇవ్వు. ఇప్పుడే ఇవ్వు. ఎప్పుడూ ఇస్తుండు.. ప్రాణాలు నిలుపుతుండు. బుధవారం 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం...

– వివరాలు 8లో..



గరిష్టం/కనిష్టం
41.0/30.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదవుతుంది. పగలు ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

జేఎన్టీయూలో పురుగుల అన్నం



అన్నంలో పురుగు

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపల్లి జేఎన్టీయూ హాస్టల్‌లో వండిన అన్నంలో పురుగులు వచ్చిన సంఘటన సోమవారం రాత్రి చోటుచేసుకుంది. భోజనం చేసే సమయంలో కొందరు విద్యార్థుల ప్లేట్లలో పురుగులు కనిపించాయి. ఆ అన్నాన్ని పక్కన పెట్టి విద్యార్థులు తమ గదులకు వెళ్లిపోయారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ రమేశ్‌ను వివరణ కోరగా.. హాస్టల్‌ను పరిశీలించామన్నారు. లైట్ల వెలుతురుకు ప్లేట్‌లో పురుగు పడిందని తెలిపారు. తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాంట్రాక్టర్‌కు సూచించామని పేర్కొన్నారు.

సీఎమ్మార్ వెంటనే ఇవ్వాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాల: సీఎమ్మార్ ఇవ్వడంలో పురోగతి లేదని, రైస్‌మిల్లర్లు తక్షణమే అందించాలని అదనపు కలెక్టర్ లత సూచించారు. మంగళవారం తన కార్యాలయంలో రైస్‌మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. లక్ష్యం ప్రకారం సీఎమ్మార్ చెల్లించాలని ఇప్పటికే రెండుసార్లు సూచించినా చెప్పినా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ఆదేశాలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ హెచ్చరించారు. 2021–22 ఆర్థిక సంవత్సరంలో డిఫాల్ట్ అయిన రైస్‌మిల్లర్లు వెంటనే ప్రభుత్వం నిర్దేశించిన సొమ్మును జమచేసి, సీఎమ్మార్ ఇవ్వాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'నిరసన తెలిపే హక్కులేదా?'



లక్ష్మణ్‌కుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసు

ధర్మపురి/కొండగట్టు: ప్రజాసమస్యల పరిష్కారం లక్ష్యంగా నిరసనలు తెలియజేసేందుకు పిలుపునిస్తే అరెస్టు చేయడం బాధాకరమని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. తాగునీటి సమస్య పరిష్కారానికి పట్టణంలో నిరసన తెలిపేందుకు అడ్లూరి ఆధ్వర్యంలో యత్నించగా.. కరీంనగర్‌లోనే ఆయనను మంగళవారం అరెస్టు చేసి కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. ధర్మపురిలో తాగునీటి సమస్యే కాదని, విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం కలుగుతోందని, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ప్రారంభించలేదని అన్నారు. ప్రజలు సమస్యల్లో ఉంటే మంత్రి కొప్పుల ఈశ్వర్ దశాబ్ది ఉత్సవాల పేరిట దావతులు చేసుకుంటూ, డ్యాన్సులు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కాగా, పోలీసులు అరెస్టు చేసినవారిలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎస్.దినేశ్, ఉపాధ్యక్షుడు వేముల రాజేశ్, నాయకులు సింహరాజు ప్రసాద్, గరిగె రమేశ్, చిలుముల లక్ష్మణ్, సీపతి సత్యనారాయణ, జాజాల రమేశ్ ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: జిల్లాలోని మోడల్ స్కూళ్లు/కాలేజీల్లో పార్ట్‌టైం పద్ధతిన అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ యాస్మిన్ బాషా తెలిపారు. మేడిపల్లి మోడల్ స్కూల్/కళాశాలలో జేఎల్ బోటనీ, జువాలజీ, కెమెస్ట్రీ, పీజీటీ తెలుగు, హిందీ, ఇంగ్లిష్ పోస్టులు ఖాళీ ఉన్నాయన్నారు. గొల్లపల్లి మోడల్ స్కూల్/కళాశాలలో జేఎల్ సివిక్స్, పీజీటీ ఇంగ్లిష్, మ్యాథ్స్, సోషల్–2, ఫిజికల్ సైన్స్, హిందీ, పీఈటీ, కోరుట్లలో జేఎల్ మ్యాథ్స్, సివిక్స్, ఎకనమిక్స్, కామర్స్, పీజీటీ మ్యాథ్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. మెట్‌పల్లిలో జేఎల్ సివిక్స్, పీజీటీ ఇంగ్లిష్, సోషల్, టీజీటీ సోషల్, ద్వితీయ భాష హిందీ, జగిత్యాలలో జేఎల్ బోటనీ, జువాలజీ, కెమిస్ట్రీ, పీజీటీ తెలుగు, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు వివరించారు. ఆయా సబ్జెక్ట్‌లో పీజీ, బీఎడ్, విద్యార్హతలు ఉండి, ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఎస్సైల బదిలీ

జగిత్యాలక్రైం: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఏడురుగు ఎస్సైలను బదిలీ చేస్తూ ఎస్పీ భాస్కర్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కె.కుమారస్వామి పెగడపల్లి నుంచి మల్యాల ఎస్సై–2గా, నరేశ్ వీఆర్ జగిత్యాల నుంచి గొల్లపల్లికి, దత్తాద్రి గొల్లపల్లి నుంచి ధర్మపురికి, కిరణ్‌కుమార్ ధర్మపురి నుంచి కోరుట్లకు, సతీశ్ కోరుట్ల నుంచి పెగడపల్లికి, రాంచంద్రం వీఆర్ జగిత్యాల నుంచి జగిత్యాల ట్రాఫిక్‌కు, రాము జగిత్యాల ట్రాఫిక్ నుంచి వీఆర్ జగిత్యాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

సర్టిఫికెట్ల టెన్షన్



- నాపేరు శ్రీనివాస్‌చారి. స్వస్థలం కోరుట్ల. స్వర్ణకారులం. ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్రంలో ఇచ్చిన కుల ధ్రువీకరణపత్రం ఉంది. కులవృత్తులకు ఆర్థిక సాయం కోసం తెలంగాణ ప్రభుత్వం జారీచేసిన సర్టిఫికెట్ కావాలంటున్నరు. దానికోసం దరఖాస్తు చేసిన. మూడ్రోజుల నుంచి మండే ఎండలో తహసీల్దార్ ఆఫీసుకు పోతున్న.



- నా పేరు సోము. మోహన్‌రావుపేట మా స్వగ్రామం. ఫ్రెండ్ వాళ్ల అబ్బాయి ఇటీవల పదో తరగతి పాస్‌అయిండు. వాళ్ల నాన్న దుబాయికి పోయిండు. బాబు పైచదువుల కోసం కుల ధ్రువీకరణపత్రం కావాలి. దాని కోసమే తహసీల్దార్ కార్యాలయానికి వచ్చిన.



కథలాపూర్ : తహసీల్దార్ కార్యాలయంలో సర్టిఫికెట్ల కోసం బారులు తీరిన దరఖాస్తుదారులు

వారమే గడువు



మేం వడ్లోళ్లం. రూ.లక్ష సాయం కోసం దరఖాస్తు చేసేందుకు కులం సర్టిఫికెట్ కావాలంటున్నరు. దాని కోసం అప్లై చేసిన. ఇంకా రాలే. దరఖాస్తుకు వారమే గడువుంది.

– వంతడుపుల సంజీవ్, సంగెం, కోరుట్ల

సిబ్బంది నియామకం



దరఖాస్తుల స్వీకరణ, జారీకోసం అదనంగా ఇద్దరు సిబ్బందిని తాత్కాలికంగా నియమించాం. సర్టిఫికెట్ల జారీలో ఎలాంటి జాప్యానికి తావులేదు.

– రాజేశ్, తహసీల్దార్, కోరుట్ల

సిబ్బంది కొరత.. ఆపై ఎన్నికల బిజీ..

తహసీల్దార్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత సేవలకు ఆటంకం కలిగిస్తోంది. ఇదే సమయంలో ప్రస్తుతం తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు, ఎన్నికల పనులు సిబ్బందిపై భారంగా మారాయి. ఇదేసమయంలో వివిధ సర్టిఫికెట్ల కోసం దరఖాస్తులు భారీసంఖ్యలో వస్తున్నాయి. వీటిని స్వీకరించడం, విచారణ చేయడం కోసం ఆర్ఐలే అందుబాటులో ఉన్నారు. బూత్‌ల వారీగా ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, జోన్లు, రూట్ మ్యాప్‌ల పరిశీలన, ఈవీఎంలను సిద్ధం చేయడం వంటి పనుల్లో రెవెన్యూ సిబ్బంది నిమగ్నమయ్యారు. దీంతో సర్టిఫికెట్ల జారీలో జాప్యమవుతోందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. గతవారం రోజుల్లో జిల్లావ్యాప్తంగా సుమారు 7వేల వరకు దరఖాస్తులు రాగా విచారణ జరిపాక 3వేల వరకు పైగా సర్టిఫికెట్లు జారీచేశామని అధికారులు తెలిపారు. సర్టిఫికెట్లను మూడ్రోజుల్లోగా జారీచేస్తున్నామని వారు వివరిస్తున్నారు.

- తహసీల్దార్ కార్యాలయాలకు దరఖాస్తుల వెల్లువ
- కులం, ఆదాయం, నివాసం ధ్రువీకరణపత్రాల కోసం అర్జీలు
- బారులు తీరుతున్న విద్యార్థులు, కులవృత్తిదారులు
- గతవారం రోజుల్లో సుమారు ఏడు వేల దరఖాస్తులు
- మూడు వేలకుపైగా జారీచేసిన అధికారులు

కోరుట్ల: ఒకవైపు విద్యాసంస్థలు ప్రారంభమయ్యాయి. మరోవైపు రాష్ట్రప్రభుత్వం బీసీ కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయం కోసం దరఖాస్తులు స్వీకరిస్తోంది. వీటికి అవసరమైన కులం, ఆదాయం, నివాసం తదితర ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థులు, కులవృత్తిదారులు పెద్దసంఖ్యలో రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేస్తున్నారు. మీసేవా కేంద్రాలు, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్న అభ్యర్థులు.. సర్టిఫికెట్లు త్వరగా జారీచేయాలంటూ తహసీల్దార్ కార్యాలయాల్లోని రెవెన్యూ అధికారులను ఆశ్రయిస్తున్నారు. వీరి రాకతో ఆయా ఆఫీసులు రద్దీగా మారుతున్నాయి.

రెండు వైపులా తాకిడి..

- కులవృత్తులు, చేతివృత్తుల వారికి పూచీకత్తు లేకుండా ప్రభుత్వం రాయితీతో కూడిన రూ.లక్ష సాయం పథకం ప్రకటించింది.
- జిల్లాలో జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.
- ఒక్కోక్క నియోజకవర్గానికి ఆయా కులాల జనాభాను బట్టి 1,000 నుంచి 1,500 మంది కులవృత్తులు, చేతివృత్తుల వారికి సర్కారు ఆర్థిక సాయం రూ.లక్ష అందజేయనుంది.
- ఇందుకోసం ఈనెల 9 నుంచి 20వ తేదీ వరకు అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించింది.
- ఈసాయం కోసం దరఖాస్తు చేసుకునే వారికి తప్పనిసరిగా కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణపత్రాలు జతచేయాలని అధికారులు సూచిస్తున్నారు.
- అయితే, కులధ్రువీకరణ పత్రాలులేని చాలామంది ఆర్థిక సాయం పొందాలనే ఆశతో మీ సేవా కేంద్రాలు, తహసీల్దార్ కార్యాలయాల వద్ద సర్టిఫికెట్లు తీసుకోవడానికి బారులు తీరుతున్నారు.
- ఫలితంగా ఆ కార్యాలయాలు సందడిగా మారుతున్నాయి.
- నాయీబ్రాహ్మణ, రజక, సగర, ఉప్పర, కుమ్మరి/శాలివాహన, కంచరి, వడ్ల, వడ్రంగి, శిల్పులు, కృష్ణబలిజ పూజల, మేదర, వడ్డెర, ఆరెకటిక, మేర, ఎంబీసీ కులాలు వారు ఈ పథకానికి అర్హులని అధికారులు తెలిపారు.
- మరోవైపు.. విద్యాసంస్థలు ప్రారంభం కావడంతో ఉన్నత చదువులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల కోసం తల్లిదండ్రులు కుల, ఆదాయ, నివాసం తదితర సర్టిఫికెట్లు ఇదే సమయంలో ఆయా సంస్థలకు సమర్పించాల్సి ఉంటుంది.
- దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు కూడా పెద్ద సంఖ్యలో దరఖాస్తు చేసుకుంటున్నారు.

బల్దియాలో అవినీతి కంపు

- పారిశుధ్య విభాగంలో అక్రమాలు
- ఆగ్రహిస్తున్న ప్రతిపక్ష సభ్యులు



జగిత్యాల మున్సిపల్ కార్యాలయం

జగిత్యాల: జగిత్యాల మున్సిపాలిటీ పారిశుధ్య విభాగంలో అనేక అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిపై ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు తీవ్ర విమర్శలు చేశారు. మరమ్మతుల పేరిట బిల్లులు పెడుతూ ప్రజాధనం దుర్వినియోగం చేస్తున్నారని ధ్వజమెత్తారు. అంతేకాదు.. వాహనాల మరమ్మతు కోసం 60ఏళ్ల వయసు దాటిన వ్యక్తిని మెకానిక్‌గా నియమించుకోవడం, నెల వేతనం రూ.20వేలు చెల్లించడం వివాదాస్పదమవుతోంది. మున్సిపల్ వాహనాలను నిత్యం మరమ్మతు చేయడం, ఫిట్‌నెస్ పర్యవేక్షించడం ఆ మెకానిక్ దినచర్య. అయితే, 50ఏళ్ల వయసు ఉన్నవారికే పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు వర్తిస్తాయని, 60ఏళ్ల వయసు వ్యక్తిని ఎలా నియమిస్తారనే విషయం ప్రశ్నార్థకంగా మారింది. ఓ ప్రముఖ ప్రజాప్రతినిధి జోక్యంతోనే ఆయనను నియమించినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

పంక్చర్లకు రూ.40,650 ఖర్చు..

- వాహనాల పంక్చర్ల పేరిట కౌన్సిల్ ఎజెండాలో రూ.40,650 పెట్టడడంపై ప్రతిపక్షాల నుంచి తీవ్ర ఆరోపణలు వచ్చాయి.
- ఐదు వాహనాల సర్వీసింగ్‌కు రూ.1,13,534 బిల్లు చేయడం కూడా విమర్శలకు తావిస్తోంది.

అనుమతిలేకుండా నియామకం..

ఉన్నతాధికారుల ఆమోదం లేకుండానే పారిశుధ్య కార్మికులను నియమిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. కొత్త కౌన్సిల్ కొలువు దీరిన సమయంలో 215 మంది కార్మికులు ఉండేవారని అంటున్నారు. అయితే, కలెక్టర్ ప్రతిపాదనతో మరో 30 మందిని నియమించినా వారిసంఖ్య 245 మందికి చేరాల్సి ఉందన్నారు. రెగ్యులర్ పీహెచ్ వర్కర్లు 48 మందితో కలిపినా 293 మంది ఉండాల్సి ఉండగా.. ఏకంగా 304 మంది పారిశుధ్య కార్మికులు ఉన్నట్లు చూపుతున్నారని ప్రతిపక్ష సభ్యులు ఆరోపిస్తున్నారు. కొత్తగా నియమించిన వారిలో ఒక్కొక్కరి నుంచి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ ఆమోదంతోనే కొత్తవారిని నియమించాలనే నిబంధన ఉన్నా.. కొందరు ఇష్టానుసారంగా కార్మికులను నియమిస్తున్నారనే చర్చ సాగుతోంది. ఈ విభాగంలో గతంలో డీజిల్ వ్యవహారంలో అక్రమాలు జరిగాయి. ఈ విషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. దీంతో డీజిల్ లావాదేవీలు పకడ్బందీగా చేపడుతున్నారు.

అనుమతి మేరకే కొనుగోలు

కౌన్సిల్ అనుమతి మేరకు మెకానిక్‌ను నియమించాం. పాలకవర్గం తీర్మానం మేరకు పారిశుధ్య కార్మికులను నియమిస్తున్నాం. ఇందులో అవకతవకలకు తావులేదు.

– బాల ఎల్లం, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జగిత్యాల

బల్దియా సమాచారం

వార్డులు 48	బ్లేడ్ ట్రాక్టర్ 1
ట్రాక్టర్లు 45	ఊడ్చేయంత్రం 1
ఆటోలు 11	ఫాగింగ్ మిషన్ 2
	టిప్పర్ 1

కొటేషన్లు లేకుండా దుస్తులు..

- కొటేషన్లు లేకుండానే పారిశుధ్య కార్మికులకు దుస్తులు సరఫరా చేసే బాధ్యతను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారని తెలిసింది.
- అయితే, అప్రూవ్ లేకుండా ఏజెన్సీ వారు బట్టలు ఎలా కుట్టారని మున్సిపల్ కమిషనర్ ప్రశ్నించడంతో బిల్లులు మంజూరు కాలేదు.
- అయితే, ఇటీవల బట్టల కోసం ఇటీవల అనుమతి తీసుకున్నారు.
- మరోవైపు.. చీపుర్ల కొనుగోలుకు ఇటీవల రూ.5.50 లక్షలు కేటాయించడం కూడా వివాదాస్పదంగా మారింది.

స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

- డ్రైవర్లు నిబంధనలు పాటించాలి
- ఎస్పీ భాస్కర్ సూచన



మాట్లాడుతున్న ఎస్పీ భాస్కర్

జగిత్యాలక్రైం: పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి అని, డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్పీ భాస్కర్ సూచించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్కూల్ బస్సు డ్రైవర్లకు మంగళవారం ట్రాఫిక్, రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ, కొద్దిరోజులుగా రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని బస్సులను జాగ్రత్తగా నడపాలన్నారు. డ్రైవర్ల నిర్లక్ష్యం, అతివేగంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. బస్సులకు అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉండాలని చెప్పారు. వర్షాకాలంలో డ్రైవర్ అప్రమత్తంగా లేకుంటే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అందుకే బ్రేక్‌లు, ఇండికేటర్లు, పార్కింగ్ లైట్లను తరచూ చెక్‌చేసుకోవాలని చెప్పారు. స్కూల్ బస్సుల్లో చిన్నపిల్లలే అధికంగా ఉంటారని, వారిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే డ్రైవర్, యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. హెల్పర్ సాయంతోనే పిల్లలను రోడ్డు దాటించాలని సూచించారు. మద్యం తాగి డ్రైవ్ చేయకూడదని సూచించారు. ఫిట్‌నెస్ లేని పాఠశాలల బస్సులపై కేసులు నమోదు చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ రామచందర్ రావు, ట్రాఫిక్ ఎస్సై రాము, పోలీస్ సిబ్బంది, స్కూల్ బస్సు డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన స్కూల్ బస్సు డ్రైవర్లు

గోదావరి జలాలు తెచ్చి.. తెలంగాణ తల్లికి అభిషేకం చేసి..

- తాగునీటి సమస్యపై కాంగ్రెస్ కౌన్సిలర్ల వినూత్న నిరసన
- గోదావరి జలాలతో తెలంగాణ తల్లి విగ్రహానికి జలాభిషేకం



కౌన్సిలర్లను అడ్డుకుంటున్న పోలీసులు

ధర్మపురి: పట్టణంలో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో కాంగ్రెస్ కౌన్సిలర్లు మంగళవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. తొలుత ఖాళీ బిందెలతో నిరసన తెలిపిన మహిళా కౌన్సిలర్లు.. ఆ తర్వాత సమీపంలోని గోదావరి నదికి వెళ్లారు. గోదావరి జలాలను బిందెలతో తీసుకొచ్చి స్థానిక తెలంగాణ తల్లి విగ్రహానికి జలాభిషేకం చేశారు. కొద్దిరోజులుగా తాగునీటి సమస్యతో పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సీఐ కోటేశ్వర్ అక్కడకు చేరుకుని నిరసనకారులను అడ్డుకున్నారు. అనంతరం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ వేముల నాగలక్ష్మి మాట్లాడుతూ, తలాపునే గోదావరి నది ఉన్నా.. కడివెడు నీళ్లకు తిప్పలు పడాల్సి వస్తోందన్నారు. నాలుగేళ్లుగా తాగునీటి సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలిపారు. ఈవిషయంపై కలెక్టర్, మున్సిపల్ అధికారులకు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకపోయిందని పేర్కొన్నారు. పట్టణ ప్రజలకు మిషన్ భగీరథ కాకుండా తాగునీటి సరఫరాకు శాశ్వత మార్గం చూపాలని డిమాండ్ చేశారు. మహిళలు సంగనభట్ల సంతోషి, జక్కు పద్మ, గరిగె అరుణ, అశెట్టి మమత, బొల్లారపు భూలక్ష్మి, సుకన్య, అప్పం తిరుపతి పాల్గొన్నారు.

ఉన్నవిషయం అంటే ఉలుకెందుకు?

- ధర్మపురివాసులకు తాగునీరు అడిగితే అరెస్టులా?
- మంత్రి ఈశ్వర్‌పై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆగ్రహం



మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాలటౌన్: ధర్మపురివాసులు నాలుగు రోజులుగా తాగునీరు అందక ఇబ్బందులు పడుతుంటే 2కే రన్ పేరిట డీజే సౌండ్స్‌తో నృత్యాలు చేయడం ఏమిటని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక ఇందిరాభవన్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దశాబ్ది ఉత్సవాలంటే ప్రజా సమస్యలు గుర్తించి పరిష్కరించాలి కానీ డ్యాన్స్‌లు చేయడమా? అని మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ప్రశ్నించారు. తాగునీటి సమస్యను పట్టించుకోకుండా దశాబ్ది ఉత్సవాల పేరిట హంగామా చేయడం సిగ్గుచేటన్నారు. తాగునీరు అందించాలని అడిగితే కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను అక్రమంగా అరెస్టు చేయడమే సుపరిపాలనా? అని ప్రశ్నించారు. రూ.వేల కోట్లు వెచ్చించి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తే.. ప్రజలు తాగడం లేదని, డబ్బా నీటినే వినియోగిస్తున్న విషయం మంత్రికి తెలియదా? అని అన్నారు. ఊరికో మినరల్‌ప్లాంట్ నిర్మిస్తే రూ.4వేల కోట్లతో రాష్ట్రప్రజల తాగునీటి అవసరాలు తీరేవని, కమీషన్ల కక్కుర్తిపడి రూ.40వేల కోట్లు ఖర్చుచేసి ప్రజలపై భారం మోపారని విమర్శించారు. రోళ్లవాగు చరిత్ర తెలుసుకుని మాట్లాడితే మంచిదని మంత్రి ఈశ్వర్‌కు సూచించారు. రాజుల చెరువు రోళ్లవాగు నీటి నిల్వ సామర్థ్యం 0.25 టీఎంసీలు ఉండగా కాంగ్రెస్ హయాంలో తాగు, సాగునీటి అవసరాలు తీర్చామన్నారు. దాని నీటి నిల్వ సామర్థ్యం 1 టీఎంసీలకు పెంచుతామని గొప్పలు చెప్పి పనులు చేపట్టి నాలుగేళ్లవుతున్నా ఎందుకు పూర్తికావడం లేదని ప్రశ్నించారు. కమీషన్ల కాళేశ్వరం ప్రాజెక్టుపై ఉన్న శ్రద్ధ రోళ్లవాగుపై ఎందుకు లేదని నిలదీశారు. వరదలతో రోళ్లవాగు ప్రాజెక్టు కట్ట తెగి వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో ఇసుక మేటలు వేస్తే రైతులకు ఒక్క రూపాయి పరిహారమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు. వాస్తవాలు ప్రజలకు తెలిసేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు, వేదికలపై చర్చకు సిద్ధమని ఎమ్మెల్సీ స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు బండ శంకర్, కల్లెపెల్లి దుర్గయ్య, గాజుల రాజేందర్, మన్సూర్, చందా రాధాకిషన్, గుంటి జగదీశ్వర్, గుండ మధు తదితరులు పాల్గొన్నారు.

మీరెందుకు ఆధునికీకరించలేదు?

- మీ హయాంలోనే గోదావరి నీరు వృథాగా పోయింది
- ప్రస్తుతం రోళ్లవాగు ప్రాజెక్టు పనులు చివరి దశకు చేరాయి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి మంత్రి కొప్పుల ఈశ్వర్ సూటిప్రశ్న



రోళ్లవాగు పనులు పరిశీలిస్తున్న మంత్రి ఈశ్వర్ తదితరులు

సారంగాపూర్(జగిత్యాల): 'రోళ్లవాగు ప్రాజెక్టు పనులు ప్రారంభించినప్పటి నుంచి మీరు విమర్శలు చేస్తూనే ఉన్నారు.. మంత్రిగా, ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రాజెక్టును ఆధునికీకరించాలనే ఆలోచన మీకు రాలేదా?' అని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్.. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిని ప్రశ్నించారు. బీర్‌పూర్‌లోని రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునికీకరణ పనులను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, జెడ్పీచైర్‌పర్సన్ దావ వసంత, రైతులతో కలిసి మంగళవారం మంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తి కావచ్చాయన్నారు. ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే నీటినిల్వ సామర్థ్యం 0.25 టీఎంసీల నుంచి 1 టీఎంసీలకు చేరుతుందని తెలిపారు. ఫలితంగా బీర్‌పూర్, ధర్మపురి మండలాల్లోని 25 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని అన్నారు. రైతులతో చర్చించాకే ప్రాజెక్టును ఆధునికీకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. కరోనా ప్రభావం, వరదల నేపథ్యంలో పనుల్లో కొంత జాప్యం జరిగినా త్వరలోనే అందుబాటులోకి వస్తుందని చెప్పారు. ఎస్సారెస్పీ నీటితో రోళ్లవాగును ఏడాదికోసారి నింపాల్సి వచ్చేదని, ఇప్పుడు ప్రాజెక్టు పూర్తయితే ఒకసారి నింపితే రెండు పంటలకు సాగునీరు అందుతుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చాలా సీనియర్ అని, మంచిని చెడుగా, చెడును మంచిగా వక్రీకరించి ప్రజలకు చెప్పగల సమర్థత ఆయనలో ఉందని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ మాట్లాడుతూ, దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో ప్రాజెక్టుల నిర్మాణం పూర్తికాకుండానే కాలువలు తవ్వించిన విషయం మరచిపోయారా అన్నారు. సీఈ సుధాకర్ రెడ్డి, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, కేడీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ ముప్పాల రాంచందర్‌రావు, ఎస్ఈ అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ధాన్యం డబ్బుల కోసం రైతు నిరసన

కాగా, బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామానికి చెందిన రైతు వెల్మ మహిపాల్‌రెడ్డి తెలంగాణతల్లి విగ్రహం, రోళ్లవాగు వద్ద మంత్రి కాన్వాయ్‌కు అడ్డుగా వెళ్లి నిరసన తెలిపాడు. 48 గంటల్లో ధాన్యం డబ్బులు చెల్లిస్తామని అధికారులు చెప్పారని, కానీ, తనకు 48 రోజులైనా డబ్బులు ఖాతాలో పడలేదని ఆవేదన చెందాడు. పోలీసులు ఆ రైతు నుంచి ప్లకార్డులు స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

వడదెబ్బతో 'ఉపాధి' కూలీ మృతి


పెద్దరాజం మృతదేహం

రాయికల్(జగిత్యాల): మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన తునికి పెద్దరాజం(65) అనే ఉపాధిహామీ కూలీ మంగళవారం వడదెబ్బ తగిలి, మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పెద్దరాజం, ఆయన భార్య తులసమ్మ మంగళవారం తోటి కూలీలతో కలిసి గ్రామంలోనే ఉపాధిహామీ పనులకు వెళ్లారు. ఎండ తీవ్రతకు అతను సొమ్మసిల్లి పడిపోయాడు. గమనించిన కూలీలు జగిత్యాల ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కూలీలు కోరారు.

దమ్మన్నపేటలో యువకుడు..


లింగమూర్తి (ఫైల్)

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని దమ్మన్నపేటకు చెందిన మోల్మూరి లింగమూర్తి(32) వడదెబ్బతో మృతిచెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. లింగమూర్తికి భార్య లావణ్య, ఏడాదిన్నర పాప ఉన్నారు. అతను గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నాలుగు రోజులుగా ఇంటివద్దే ఉంటున్న లింగమూర్తి మంగళవారం ఉదయం ఓ మేస్త్రీ వద్దకు కూలీ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం వరకు పని చేసి, భోజనానికి ఇంటికి వచ్చాడు. నీళ్లు తాగిన వెంటనే అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు 108కు ఫోన్ చేసిన కాసేపటికే మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

విద్యార్థిని ఆత్మహత్య


శ్రావణి మృతదేహం

కోరుట్ల రూరల్: మండలంలోని ధర్మారం గ్రామంలో జొన్నలగడ్డ శ్రావణి(17) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఖమ్మం జిల్లాకు చెందిన జొన్నలగడ్డ కృష్ణ–నిర్మల దంపతులు పదేళ్లుగా మేస్త్రీ పని చేసుకుంటూ ధర్మారంలోనే ఉంటున్నారు. వీరికి ఇద్దరు ఆడపిల్లలున్నారు. చిన్న కూతురు శ్రావణి ఇంటర్ పూర్తి చేసింది. డిగ్రీ చదివేందుకు సెంట్రల్ యూనివర్సిటీ పరీక్ష కోసం ప్రిపేర్ అవుతోంది. సీటు వస్తుందో రాదోనని మానసిక ఆందోళనకు గురవుతోంది. ఈ క్రమంలో మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు మల్లాపూర్ ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు.

రైస్ మిల్లులో అగ్ని ప్రమాదం


మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కోరుట్ల రూరల్: మండలంలోని జోగిన్‌పెల్లి శివారు ఎస్‌ఎల్‌ఎస్‌ఎస్ రైస్ మిల్లులో మంగళవారం ఉదయం షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. చుట్టుపక్కలవారు మెట్‌పల్లి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. దీంతో అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఫైర్ ఇంజిన్‌తో వచ్చి, మంటలు ఆర్పివేశారు. ఈ ప్రమాదంలో 30 వేల గన్నీ సంచులు కాలిపోయాయని సుమారు రూ.30 లక్షల నష్టం వాటిల్లిందని మిల్లు యజమాని శంకర్ ఆవేదన వ్యక్తం చేశారు.

రక్తమిద్దాం.. ప్రాణం నిలుపుదాం



- ఒక యూనిట్ రక్తంతో నలుగురికి ప్రాణం పోయొచ్చు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం


కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు

జగిత్యాల/సిరిసిల్లటౌన్/కోల్‌సిటీ(రామగుండం)/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్/పెద్దపల్లిరూరల్: దాత ఇచ్చిన ఒక యూనిట్ రక్తం నలుగురికి ప్రాణం పోస్తుంది. రక్తదానం బాధితులకు, దాతలకు మధ్య బంధాలను ఏర్పాటు చేస్తుంది. అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యానికి గురైనప్పుడు రక్తం అవసరం ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు దాతలు ఒక్క ఫోన్‌కాల్‌తో స్పందించి, రక్తదానం చేస్తున్నారు. యువతలో దీనిపై అవగాహన వచ్చింది. వాట్సాప్ గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉంటూ ఎవరికి రక్తం అవసరమైనా వెళ్లి, ఇస్తున్నారు. బాధితుల ప్రాణాలు కాపాడుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే జీవ శాస్త్రవేత్త మానవ రక్తకణాలను కనుగొన్నందుకు గాను వైద్య శాస్త్రంలో 1930లో నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతి గుర్తింపుగా రక్తం విలువను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా కథనం.

35 రోజులు భద్రపరచవచ్చు

ఒక మనిషి నుంచి రక్తాన్ని సేకరించి, 35 రోజుల వరకు భద్రపరచవచ్చు. ఆ తర్వాత అది పని చేయదు. కాగా, నాలుగు రకాల బ్యాగులను ఉపయోగించి, రక్తాన్ని సేకరించాల్సి ఉంటుంది. అనంతరం దాన్ని సింగిల్, డబుల్, ట్రిపుల్, క్వాడ్రిపుల్ బ్యాగులుగా విభజించి, భద్రపరుస్తుంటారు. అప్పుడు దాదాపు 120 రోజుల వరకు నిలువ చేయడానికి ఆస్కారం ఉంటుందని రక్తనిధి ప్రతినిధులు తెలిపారు.

వీరు రక్తదానం చేయొచ్చు

- 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు, 45 కిలోల ఎక్కువ బరువుండి, రక్తంలో 12.5 గ్రాముల హిమోగ్లోబిన్ కంటే ఎక్కువ ఉన్నవారెవరైనా రక్తదానం చేయవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.
- హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్–బి, సి, బ్లడ్ కేన్సర్, హైబీపీ, క్షయ, మూర్ఛ, మత్తు పదార్థాలకు బానిసలైన వారు రక్తదానం చేయడానికి అనర్హులు. టాటూ వేసుకున్నవారు కూడా చేయొద్దు.
- రక్తదానం చేసి, 90 రోజులు దాటినవారు మళ్లీ చేయొచ్చు.

2 వేల మందితో వాట్సాప్ గ్రూప్



కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడు మంచికట్ల శ్రీనివాస్ 2 వేల మంది రక్తదాతలతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్నవాళ్లకు సకాలంలో రక్తదానం చేయించి, ఆదుకుంటున్నాడు. 2012లో స్నేహితులతో కలిసి స్పందన యువసేన అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఇప్పటివరకు 17 సార్లు రక్తదానం చేశా.

సిరిసిల్ల బ్లడ్‌బ్యాంకులో వసతులు

రాజన్నసిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తదాతల కోసం మంత్రి కేటీఆర్ సహకారంతో సకల వసతులు కల్పించారు. అన్ని రోజుల్లో దాతల నుంచి రక్తం సేకరిస్తున్నారు. ఈ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఇప్పటివరకు 112 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వీటిల్లో 6,774 మంది దాతలు రక్తదానం చేశారు. జిల్లాలోని రెడ్‌క్రాస్, రెడ్‌డ్రాప్, లయన్స్ క్లబ్ తదితర స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాయి.

పెద్దపల్లి జిల్లాలో..

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఎన్టీపీసీలోని ధన్వంతరి ఆస్పత్రిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ తెలిపారు.

జగిత్యాల జిల్లాలో శిబిరాలు

జగిత్యాల జిల్లాలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకటి, ప్రైవేటుగా నాలుగు(జగిత్యాలలో 3, మెట్‌పల్లిలో 1) రక్తనిధి కేంద్రాలున్నాయి. సర్కారు దవాఖానాలో ఉచితంగానే పేషెంట్స్‌కు అత్యవసరంగా రక్తం అందజేస్తారు. అంతేకాకుండా ఇక్కడి నుంచి మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి ఆస్పత్రులకు సైతం పంపిస్తుంటారు.

నేడు రాజ్‌భవన్‌లో 54వ సారి..


రక్తదానం చేస్తున్న రాజయ్య

పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన కొండేటి రాజయ్య ఇప్పటివరకు 53 సార్లు రక్తదానం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో 54వ సారి రక్తదానం చేయనున్నట్లు తెలిపారు. అక్కడే గవర్నర్ తమిళిసై చేతులమీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

3 వేల యూనిట్లు చేయించా



నేను పదేళ్లలో 48 సార్లు ప్లేట్‌లెట్స్, రక్తదానం చేశా. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా ఫోన్ చేస్తే స్పందిస్తున్న. మా మిత్రులతో ఇప్పటివరకు 3 వేల యూనిట్లు రక్తదానం చేయించాను. సినీహీరో చిరంజీవి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న.

– గాలిపెల్లి కుమార్, బొమ్మకల్, కరీంనగర్

రక్తనిధికి పంపిస్తున్నం



సిరిసిల్ల పట్టణానికి చెందిన మా స్నేహితులతో కలిసి రెడ్ డ్రాప్ అనే సామాజిక సేవా సంస్థను నడిపిస్తున్నాం. ఇప్పటివరకు వందల మంది సభ్యులతో వేలాది మందికి రక్తదానం చేయించాం. రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని రక్తనిధి కేంద్రానికి పంపిస్తున్నం. రక్తం అవసరమున్నవారు 98859 75566 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

– అస్లాం, రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ప్రతినిధి, సిరిసిల్ల

ఎంతోమందిని కాపాడిన



అత్యవసర సమయాల్లో బాధితులకు రక్తదానం చేయాలి. నేను ఇప్పటివరకు 63 సార్లు చేసి, ఎంతోమంది ప్రాణాలు కాపాడిన. రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న.

– తుమ్మనపల్లి బాలకృష్ణ, జగిత్యాల

ఆరోగ్యంగా ఉంటాం



రక్తదానం చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటామన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. రక్తదానం చేస్తే ఇతరులకు సాయం చేశామన్న సంతృప్తి ఉంటుంది. యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– కావేటి రాజ్‌గోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్, పెద్దపల్లి

అపోహలు, భయం వద్దు



రక్తదానం చేయడంలో అపోహలు, భయం వద్దు. 20 నుంచి 60 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతులు, ప్రతీ మూడు నెలలకోసారి రక్తం ఇవ్వవచ్చు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ బి.అమూల్ కుమార్, పాథాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గోదావరిఖని

మహిళల సంక్షేమమే సీఎం ధ్యేయం

- మహిళా సంక్షేమ దినోత్సవంలో మంత్రి కొప్పుల ఈశ్వర్


మంత్రి కొప్పులకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా, ప్రజాప్రతినిధులు

ధర్మపురి: మహిళల సాధికారిత కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నారని, వారి సంక్షేమమే ఆయన ధ్యేయమని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ధర్మపురిలోని ఎస్‌హెచ్ గార్డెన్‌లో మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రికి అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలతో పేర్చిన బొకేను అందించారు. ఆయన మాట్లాడుతూ.. ఇంటికి దీపం ఇల్లాలు అన్నట్లు ఇల్లాలు మంచిగుంటే ఆ ఇల్లు బాగుంటుందని, మహిళలు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళా సాధికారితపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 30 డిగ్రీ రెసిడెన్సియల్ కళాశాలలను ఒకేసారి ప్రకటించడమే ఇందుకు నిదర్శనమని చెప్పారు. మహిళా ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రసూతి సెలవులను ఆరు నెలలకు పెంచిందన్నారు. మహిళల ఆశీర్వాదంతో రాష్ట్రంలో మళ్లీ బీఆర్‌ఎస్ ప్రభుత్వమే వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం వివిధ రంగాల్లో విజయం సాధించిన మహిళలను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ యాస్మిన్ బాషా, డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీ చిట్టిబాబు, బత్తిని అరుణ, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు

- రూ.లక్ష కోట్లు ఖర్చు చేసినా చుక్క నీరు రాలే
- బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్


మాట్లాడుతున్న వివేక్

వెల్గటూర్(ధర్మపురి): కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేపట్టారని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు వివేక్ ఆరోపించారు. మంగళవారం రాజారాంపల్లిలోని ఓ గార్డెన్స్‌లో నిర్వహించిన ధర్మపురి నియోజకవర్గ మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. కేవలం 38 వేల కోట్లతో తుమ్మిడిహెట్టిలో నిర్మించ తలపెట్టిన ప్రాజెక్టును కమీషన్ల కోసం రీడిజైన్ పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని మండిపడ్డారు. రూ.లక్ష కోట్లు ఖర్చు చేసి, నిర్మించిన ఈ ప్రాజెక్టు నుంచి మూడేళ్లలో చుక్క నీరు కూడా రాలేదన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో మేగా కృష్ణారెడ్డికి రూ.లక్షల కోట్లు దోచిపెట్టారన్నారు. సీఎం కేసీఆర్ రూ.5 లక్షల కోట్ల అప్పులు చేసి, ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చేశాడని పేర్కొన్నారు.

ధర్మపురి నుంచే పోటీ!

ఈ సమావేశంలో తాను ధర్మపురి నుంచే పోటీ చేయనున్నట్లు పరోక్షంగా సంకేతాలిచ్చిన వివేక్ కార్యకర్తల్లో జోష్ నింపారు. కార్యక్రమంలో బీజేపీ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు మోరపెల్లి సత్యనారాయణరావు, ఉపాధ్యక్షుడు గాజుల మల్లేశం, జిల్లా కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ కస్తూరి సత్యం, మండల అధ్యక్షుడు చక్రపాణి, ఉపాధ్యక్షుడు సతీశ్, ప్రధాన కార్యదర్శి గోపతి జనార్ధన్, అధికార ప్రతినిధి వెంకటగిరి, వివిధ మోర్చాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడాలి


విరాళం ఇస్తున్న ఎన్‌ఆర్‌ఐ విద్యాధర్‌రావు

మల్లాపూర్(కోరుట్ల): విద్యార్థుల సర్వతోముఖావృద్ధికి ఉపాధ్యాయులు తోడ్పడాలని ఎన్‌ఆర్‌ఐ డాక్టర్ గంగ్ర విద్యాధర్‌రావు అన్నారు. ఆయన స్వగ్రామం మల్లాపూర్ మండలంలోని సాతారంను మంగళవారం సందర్శించారు. గ్రామంలోని వార్డుల్లో అభివృద్ధి పనుల ప్రగతిని తెలుసుకున్నారు. హరితహారం బృహత్తరమైన కార్యక్రమమని, గ్రామస్తులందరూ మొక్కలు నాటి, సంరక్షించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల కోసం అందించిన ఆయన స్వగృహం శిథిలావస్థకు చేరగా రూ.5 లక్షలతో 3 మోడ్రన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా తీర్చిదిద్దారు. మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి, వాటిని ప్రారంభించారు. ప్రాథమిక పాఠశాలకు రూ.20 వేలను విరాళంగా అందజేశారు. ఉన్నత పాఠశాలలో ఇటీవల పదో తరగతిలో ప్రతిభ కనబర్చిన ముగ్గురు విద్యార్థులకు రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచు సుమలత, ఎంపీటీసీ సభ్యుడు గున్నాల శ్రీనివాస్, ఉపసర్పంచ్ మెడకొక్కుల శ్రీనివాస్‌యాదవ్, యువజన సంఘాల సమితి జిల్లా అధ్యక్షుడు రాజేశ్, పంచాయతీ కార్యదర్శి వినోద్, ప్రధానోపాధ్యాయులు రమేశ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విష్ణు సహస్ర పారాయణం



పారాయణంలో మహిళా మండలి సభ్యులు

ధర్మపురి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై మంగళవారం విష్ణు సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో శ్రీశారద మహిళా మండలి చేపట్టిన ఈ కార్యక్రమం భక్తులను అలరింపజేసింది. ఈ కార్యక్రమంలో మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కొండపై భక్తుల పూజలు


క్యూలైన్‌లో దర్శనానికి వెళ్తున్న భక్తులు

కొండగట్టు(చొప్పదండి):కొండగట్టు శ్రీఆంజనేయ స్వామిని మంగళవారం సుమారు 20 వేల మంది భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా సత్యానారాయణస్వామి వ్రతం చేశారు. ఆలయంలో టెంకాయలు కొట్టి స్వామివారిని దర్శించుకున్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ఆలయం ఎదుట చెట్లకింద భక్తులు సేద దీరారు. దర్శనం ఆలస్యం కాకుండా ఏఈవో శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఈవో వెంకటేశ్, అధికారులు జమున, శ్రీనివాస్, డైరెక్టర్ కొంక నర్సయ్య తదితరులు సేవలు అందించారు.

టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీకి ఏర్పాట్లు

- నేటి నుంచి 22వ తేదీ వరకు పరీక్షలు
- 2,406 మంది విద్యార్థులు.. 6 కేంద్రాలు


కట్లకుంట జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేస్తున్న హెచ్‌ఎం

కథలాపూర్(వేములవాడ): జిల్లాలో పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు బుధవారం నుంచి నిర్వహిస్తారు. ఈనెల 22వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయి. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు అన్నిఏర్పాట్లు చేశారు. రోజూ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు నిర్వహిస్తారు. సైన్స్ పరీక్షకు అదనంగా 20 నిమిషాల సమయం కేటాయించారు.

జిల్లాలో 6 పరీక్ష కేంద్రాలు..

- సప్లిమెంటరీ పరీక్షల కోసం జిల్లాలో 6 కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- మొత్తం 2,406 మంది పరీక్ష ఫీజు చెల్లించారు.
- జగిత్యాలలో నాలుగు ప్రైవేట్ పాఠశాలు, కోరుట్లలో ఒక ప్రైవేట్ పాఠశాల, మెట్‌పల్లిలోని మరో ప్రైవేట్ పాఠశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు.
- ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.
- విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకొని నిర్భయంగా పరీక్షలు రాయాలని అధికారులు కోరారు.

ఆగివున్న టిప్పర్‌ను ఢీకొన్న బైక్

- యువకుడికి తీవ్ర గాయాలు


పవన్ (ఫైల్)

వెల్గటూర్(ధర్మపురి): మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎండపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కుషనపెల్లి పవన్(25)కు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. పవన్ మంగళవారం రాత్రి బైక్‌పై కొత్తపేట నుంచి వెల్గటూర్ వస్తున్నాడు. మండల కేంద్రంలోని కోటిలింగాల కమాన్‌కు సమీపంలో ఆగివున్న టిప్పర్‌ను అతివేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడగా పరిస్థితి విషమంగా ఉంది. బాధితుడిని అంబులెన్సులో కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై శ్వేత పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

భూమిలోకి అక్రమంగా ప్రవేశించిన వ్యక్తులపై కేసు

సారంగాపూర్(జగిత్యాల): బీర్‌పూర్ మండలంలోని తుంగూర్ గ్రామంలో ఇతరుల భూమిలోకి అక్రమంగా ప్రవేశించి, తాత్కాలిక నిర్మాణం చేపట్టిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఏఎస్సై రవీందర్ కథనం ప్రకారం... తుంగూర్‌కు చెందిన దన్నపునేని వసంతరావు భూమిలోకి అదే గ్రామానికి చెందిన దోసారపు సత్తన్న, అతని తండ్రి పెద్ద గంగయ్య మంగళవారం అక్రమంగా ప్రవేశించారు. ఆ భూమిని చదును చేసి, వెదురు కర్రలతో నీడ ఏర్పాటు చేసుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సత్తన్న, పెద్ద గంగయ్యలపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై పేర్కొన్నారు.